స్మైల్
సూపర్ స్పెషాలిటీ
ఈ కార్డు ద్వారా జీవితాంతం కుటుంబసభ్యుల (నలుగురు) ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చులో 30% రాయితీ.
ప్రభుత్వ ఉద్యోగులకు వారి కుటుంబసభ్యులకు రిటైర్డ్ ఉద్యోగులకు రీయింబర్స్‌మెంట్ సదుపాయం.
SMILE
30% రాయితీ
రామ్మూర్తినగర్, నెల్లూరు, ఫోన్ : 0861-2330949, 2344693

Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు | స్థాపితం: 1930 | జీవనదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 38 • 4-9-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

కేర్
సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మరియు రిటైర్డ్ ఉద్యోగుల ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చును తిరిగి పొందే (రీయింబర్స్‌మెంట్) సదుపాయం కలదు.
డా॥ అలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి, MDS,
Asst. Professor Endodontics
పొగతోట, నెల్లూరు - ఫోన్ : 2303300



నువ్వులేవు నీ 'బాట' వుంది!

# [ అనాధలను చేశాడు ]

వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి మరణం మనసులను కలిచివేసే విషాదం. రాష్ట్ర ప్రజలను ఈ వార్త దిగ్భ్రాంత పరిచింది. హఠాత్తుగా కళ్లముందు ప్రపంచం శూన్యమైనట్లు, అంధకారం అలుముకొన్నట్లు విలవిలలాడి పోతున్నారు ప్రజలు. గత ఆరేళ్లలో ఆయన ప్రజలకు అంతగా సన్నిహితమైనారు. ముఖ్యమంత్రిగా పదవి చేపట్టిన నాటి నుంచి ఆయన చేపట్టిన ప్రజోపయోగకర కార్యక్రమాలు ఆయన్ను ప్రజల హృదయాలకు ఎంతో దగ్గర చేసింది. ఏ ఆపద వచ్చినా, ఏ అవసరం పడినా ప్రభుత్వం వుంది అనే విశ్వాసాన్ని పేద ప్రజలలో కల్గించడంలో వైఎస్ సఫలీకృతమైనారు. పేద కుటుంబాలలో గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధులు, లివర్ సమస్యల వంటివి తలెత్తితే, కాటికి పిలుపు కోసం ఎదురు చూడడం తప్ప చేయగల్గింది ఏదీ లేని స్థితి. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా అటువంటి వారికి అనాధ రక్షకుడిగా ఎదిగాడు వైఎస్. అటు పేదలనే కాకుండా ప్రజలందరికీ ప్రాణప్రదాయిని 108 అంబులెన్స్ పథకం. ఏ రాత్రిపూట ఎవరికి ప్రాణం మీదకు వచ్చినా, ఏ రహదారిలో వాహనాల క్రిందపడి నెత్తుటి మడుగులో తేలియాడాల్సిన దుర్గతి పట్టినా క్షణాలలో వచ్చి వాలుతున్న అద్భుత సేవా పథకమది. ఉచిత విద్యుత్ రైతులలో కల్గించిన ఆత్మస్థైర్యం అంతా ఇంతాకాదు. రైతుల ఆత్మహత్యలు ఆయన్ను కలిచి వేస్తూ వుండేవి. వాటిని రూపు మాపడానికి చిత్తశుద్ధితో ప్రయత్నం చేసేవాడు. పేదలందరికీ గూడు కల్పించడానికి వైఎస్ ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం విస్తృతి, ప్రధానిని కూడా ఆశ్చర్యపరచింది. ఒక్కసారిగా ఇన్ని లక్షల ఇళ్ల నిర్మాణం తలపెట్టడం ఎంత సాహసోపేతమైన నిర్ణయమో వర్ణించలేము.

అటు సంపన్నులు, పారిశ్రామికులకు కూడా అదే తీరులో పరిధులు మీరి మరీ ఉపకారాలు చేశాడు. ఎస్ఇజడ్, ఓడరేవులు, విద్యుత్ కర్మాగారాలు వంటి వాటికి ప్రభుత్వాన్ని దోచి పెడుతున్నారన్న విమర్శ వచ్చినా పట్టించుకోకుండా పారిశ్రామిక అభివృద్ధికి ఇతోధిక సహకారం అందించాడు. దానివల్ల రాష్ట్రంలోని ఎన్నో ప్రాంతాలలో అభివృద్ధి కళ్లకు కనపడుతున్నది.

తన అనుచరులు, అభిమానులకు కూడా వైఎస్ఆర్ అనాధ రక్షకుడి క్రిందనే లెక్క వారి తప్పులను, పాపాలను తాను మోసి, వారందరూ కోట్లకు పడగలెత్తేట్లు చేశారాయన. ఏ పని పడినా, ఏ అవసరం ఏర్పడినా, ఏకోరిక కల్గినా వైఎస్ వున్నాడులే అనే ధైర్యంతో కాలం గడుపుతున్నవారు కోకొల్లలు.

వీరందరికీ ఇప్పుడు భవిష్యత్తు అంధకార బంధురంగా మారింది. రేపు ఏమిటి అన్నది పెద్ద ప్రశ్నగా మారుతున్నది. తాము హఠాత్తుగా అనాధలుగా మారిపోయిన భావనతో కుమిలి పోతున్నారు. మరొకప్రక్క రాష్ట్రం పరిస్థితి కూడా అదే తీరులో దుర్భరంగా వుంది. లక్ష కోట్ల రూపాయల జలయజ్ఞం నిర్మాణాలు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, రూరల్ ఐఐటిలు, గ్రామీణ విశ్వవిద్యాలయాలు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప భవన సముదాయాలు వంటి అసంఖ్యాకమైన కార్యక్రమాల గతి ఏమిటి అన్నది ప్రశ్నగా మారింది. వీటిని కొనసాగిస్తారా లేక ఖజానా ఖాళీ అనే నెపంతో అర్ధాంతరంగా నిలిపి వేస్తారా అన్నది అనుమానం.

అటు పేద ప్రజలు, ఇటు పారిశ్రామికులు, భూస్వాములు, కాంట్రాక్టర్లు, అభిమానులు, అనుచరులందరూ రాజశేఖరరెడ్డి మరణంతో అనాధలై పోయామన్న భావనకు గురౌతున్నారు. తమ భవిష్యత్తేమిటన్న అయోమయానికి లోనౌతున్నారు. ఒక్క వ్యక్తి జీవితం ఇన్ని కోట్లమంది బ్రతుకులతో ముడి పడడం అబ్బురమైన విషయం. ఇందిరమ్మ మరణంతో దేశం యావత్తు అనాధగా మారిందనే అభిప్రాయం కల్గింది. ఆ ఘనత ఇప్పుడు వైఎస్ఆర్‌కు దక్కింది. సార్థకమైన జీవితమాయనది. ఆయన స్మృతికి మా అశ్రుపూరిత నివాళి.

## జనవాణి

### వైఎస్ వంటి సిఎం రారు!

రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని ప్రజోపయోగ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిన ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు. ఆయన తీసుకొన్న నిర్ణయాల వల్ల రాష్ట్రంలో లబ్ధిపొందని వాళ్లు లేరంటే అతిశయోక్తి కాదు. ఆయన ఆకస్మిక మరణం ప్రజలందరికీ తీరనిలోటు. రాజశేఖర్‌రెడ్డి గారి ఆత్మకు భగవంతుడు శాంతిని చేకూర్చాలని ప్రార్థిస్తున్నాం.

నాగసూరి కామేశ్వరరావు, నెల్లూరు

### మహిళాభ్యుదయం

పంచాయితీల్లో మహిళలకు యాభైశాతం సీట్లు రిజర్వు చేయాలని కేంద్రంలోని యుపిఏ సంకీర్ణ ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ లక్ష్య సాధనకోసం వచ్చే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రతిపాదించనున్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థలో ఇప్పటికే మహిళలకు 33శాతం రిజర్వేషన్ వుంది. పార్లమెంటు, శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వడంలో ఎదురవుతున్న ప్రతిబంధకాన్ని పరిష్కరించలేకపోతున్నారు. దీన్ని అధిగమించను ఈ నిర్ణయం తీసుకొన్నా మొత్తం మీద మహిళాభ్యుదయానికి ఇదెంతో దోహదకారి అవుతుంది.

పి,అరుణకుమారి, నెల్లూరు

### ప్రజారాజ్యం పయనమెటు?

రాజకీయాల్లో చిరంజీవి పసిపిల్లోడు. అసలే ఓడిన వలస పక్షులు పార్టీని మధ్యలో వదిలేసి తమ పాతగూళ్లకు ఎగిరిపోవడంతో చిరంజీవి దిగాలుపడివున్నాడు. జెండాపీకేద్దామా అని గెలిచిన ఎమ్మెల్యేలు మధనపడుతున్నట్లు 'ఈనాడు' పత్రికలో పేలిన బాంబు ఎంతటి హిట్లర్‌నైనా కంగారు పెట్టకమానదు. 'జమీన్‌రైతు' కూడా కాంగ్రెస్‌లో ప్రజారాజ్యం విలీనంతో మెగాస్టార్ కేంద్రమంత్రి అయ్యే అవకాశముందని భవిష్యవాణి విన్పించింది. రాజ్యాధికారమే లక్ష్యంగా ఆవిర్భవించిన ప్రజారాజ్యం పార్టీకి అర(కొర) విందులు రుచిస్తాయా? వేచి చూడాల్సిందే.

ఎం.రామమూర్తి, విశాఖపట్నం

## 70 ఏళ్ల క్రితం ఈవారం

8-9-1939
పేజీలు : 18 వెల: అణా

### రైతుబిడ్డ

రైతుజాతికి సంబంధించిన వారంతా ఈ ఫిలిం చూడదగింది. జమీన్‌రైతు అనేవాడు చూడడమే గాదు. ఈ సమస్యను ఇంతమాత్రమైనా ఫిలిం మీద కెక్కించినందుకు రామబ్రహ్మం గారికి నమస్కరించి తీరాలిసిందీ గూడా– రైతులే గాదు జమీందార్లు గూడ తమ అపభ్రంశాల ఈయద్దం మీద జూచి హృదయ పరివర్తనకు ప్రవర్తించాలసిందీ గూడా–

తక్కిన ప్రజానీకం కూడా ఇలాంటి నరక భూయిష్టమైన జమీన్‌రైతు దుర్గతిని తిలకించి ఆ సమస్య పట్ల అధమం రెండు కన్నీటి బొట్లు రాల్చవలసిందీ గూడా–

–జమీన్‌రైతు

***

వెంకటగిరి, బొబ్బిలి జమీందార్లు ఈ ఫిలిమును నిషేధింపచేయడానికి నోటీసిచ్చింది నిజం – వారి మద్రాసు లాయర్లు 27తేది నెల్లూరు వచ్చి ఫిలిమును దర్శించి నోట్సు తీసుకపోయింది నిజం. ఇంత వరకు హైకోర్టులో కేసుదాఖలైనట్లు మాత్రం వర్తమానం తెలియదు.

***

రైతు సమస్యల్ని అద్భుతంగా చిత్రించిన అపూర్వ చిత్రం. జమీందారీ దౌర్జన్యాన్ని ప్రతిఘటించి రైతులలో నూతన చైతన్యాన్ని కలుగజేస్తుంది. ప్రజల్లో గొప్ప ప్రబోధం కలిగిస్తుంది.

–బావినీడు

***

### లఘు విమర్శలు

నెల్లూరు ట్రంకురోడ్డులో 4తేది రాత్రి షుమారు పది గంటలప్పుడు ఇరువురు పత్రికల వారిని లైట్లు లేకుండా పోవుచుండినందులకు టౌన్ సబ్‌యిన్స్‌పెక్టరు గారు దబాయిస్తుండినాడట. నోరుగల ఒక రెడ్డిగారు 'తమరి సైకిలుకు లైటు వుందా' అని రంధ్రాన్వేషణం చేసేటప్పటికి, సబ్‌యిన్స్‌పెక్టరు గారు మారు మాట్లాడకుండా వెళ్లిపోయినాడట.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

4 - 9 - 1959
పేజీలు: 12 వెల: 0-3-0

### నాగపూర్ కాంగ్రెస్ ఖర్చు 17లక్షలు

నాగపూర్ కాంగ్రెస్ మహాసభకు 16,87,000 రూపాయలు ఖర్చు అయిందట. అంటే సమష్టి వ్యవసాయం నినాదమిచ్చి దేశములో కలవరం కలిగించుటకు యింత పెద్ద మొత్తం ఖర్చయిందన్న మాట.

ఇందులో ఒక్క పాకలు, పందిళ్లకే 6లక్షల రూపాయలు పట్టింది. ఇక భోజనాలకు 2లక్షలు, విద్యుచ్ఛక్తికి 2 లక్షలు వ్యయమయింది. తక్కిన ఏడు లక్షలు యితర ఏర్పాట్లకు అయి వుంటుంది.

ఇందుకుగా ఆహ్వాన సంఘ సభ్యత్వం వల్ల 3 లక్షలు; టిక్కెట్ల వల్ల 1లక్ష, పంచవర్ష ప్రణాళిక ప్రచారశాఖ వల్ల 1లక్ష అంగళ్ల బాడుగల వల్ల 81వేలు వచ్చిందట.

స్వరాజ్యానంతరం గూడా కాంగ్రెస్ మహాసభలు యింత ఆడంబరంగా, దుబారాగా జరగవలసిందేనా?

### ఇందుకూరుపేటకు టెలిఫోన్ సౌకర్యం

నెల్లూరు తాలుకా ఇందుకూరుపేటకు టెలిఫోన్ సౌకర్యం కల్గించబడుతున్నది. పబ్లిక్‌కాల్ ఆఫీసు ప్రారంభోత్సవం గూడా నేడోరేపో జరుగబోతున్నది. ఫోనోగ్రాం సౌకర్యం యిదివరకే వున్నది.

ఇందుకూరుపేట ఫిర్కా కేంద్రమేగాకుండా పంచాయతీ సమితి కేంద్రంగా గూడ వుంటున్న ముఖ్యమైన పెద్ద గ్రామం.

ఈ గ్రామానికి పోస్టల్ సౌకర్యాలను పెంచడంలో పోస్టుమాస్టరు మోహన్‌నాయుడు చేస్తున్న కృషి ప్రశంసనీయం.

# నెల్లూరు ముచ్చట్లు

## దిగ్భ్రాంతిలో సింహపురి!

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హెలికాప్టర్ ప్రమాదంలో తుదిశ్వాస విడిచారన్న వార్త విన్న సింహపురి ప్రజలు దిగ్భ్రాంతికి లోనయ్యారు. 3వ తేది 10 గంటలకు ఈ వార్త నెల్లూరు నగరంలో దావానంలా వ్యాపించడంతో వ్యాపారసంస్థలు, హోటళ్లు, సినిమా హాళ్లు, స్కూళ్లు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్టీసి బస్సులు, సిటీబస్సులు ఆగిపోవడంతో జనజీవనం ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. ఎసి సెంటర్‌లో ఆనం సోదరులు, రాజీవ్‌భవన్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి బృందం, జడ్పీ కార్యాలయంలో ఛైర్మన్ కాకాణి గోవర్ధన్ రెడ్డి, కలెక్టరేట్‌లో కలెక్టర్ రామ్‌గోపాల్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మల్లారెడ్డి ప్రత్యేకంగా పెట్టిన వైఎస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరంలోని వివిధ కూడళ్లలో వైఎస్ అభిమానులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి ఆయన చిత్రపటాలు పెట్టి దివంగత నేతపై తమకున్న అభిమానాన్ని చాటారు. కొన్నిచోట్ల టీవీలు కూడా ఏర్పాటు చేయడంలో ఈ శిబిరాలు జనాలతో కిటకిటలాడాయి. 4వ తేది కూడా నగరంలో ఇదే పరిస్థితి కొనసాగింది.

## సుబ్రహ్మణ్యం అంత్యక్రియలు!

ముఖ్యమంత్రితోపాటు హెలికాప్టర్‌లో పయనిస్తూ మరణించిన ఆయన ముఖ్యకార్యదర్శి డాక్టర్ సుబ్రహ్మణ్యం పార్థీవ శరీరాన్ని 4వ తేది ఉదయం సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరుకు తీసుకొచ్చారు. అనంతరం ఆయన స్వగ్రామం గుడిపల్లిపాడుకు తరలించి గ్రామస్తులు, బంధువుల సందర్శనార్థం వుంచారు. అనంతరం గుడిపల్లిపాడు నుంచి నెల్లూరు నగరంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా చెముడుగుంటలో ప్రత్యేకంగా నిర్మించనున్న సుబ్రహ్మణ్యం ఘాట్‌కు చేర్చి అక్కడ అంత్యక్రియలు చేశారు.

## కన్నీళ్ల పర్యంతమైన ఐఎఎస్ అధికారులు

ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి డాక్టర్ సుబ్రహ్మణ్యం అంత్యక్రియల్లో పాల్గొనను సీనియర్ ఐఎఎస్ అధికారులు కోప్పోలు రాజు, డాక్టర్ రాజశేఖర్, విజయకుమార్, దాన కిషోర్, ఎల్వీ సుబ్రహ్మణ్యం, పియూష్ కుమార్ 4వ తేది నెల్లూరు వచ్చారు. గుడిపల్లిపాడులో ఆయన పార్థీవ శరీరాన్ని సందర్శించే సమయంలో ఉద్వేగానికిలోనై నెల్లూరు పాత కలెక్టర్లు రాజు, రాజశేఖర్ కన్నీళ్లపర్యంతమయ్యారు. సుబ్రహ్మణ్యం సతీమణి, ఆయన కుమారుడు, కుమార్తెను చూసి ప్రతి ఒక్కరి హృదయం ద్రవించింది.

## రామనారాయణ విందుకు ప్రసన్న, శ్రీధర్‌కృష్ణారెడ్డి!

జిల్లాకు చెందిన శాసనసభ్యులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆగష్టు 27వ తేది హైదరాబాద్‌లోని జలవిహార్‌లో విందునిచ్చారు. కాంగ్రెస్‌పార్టీకి చెందిన శాసనసభ్యులంతా ఈ విందుకు హాజరయ్యారు. కోవూరు శాసనసభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, నెల్లూరు సిటీ శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్ కృష్ణారెడ్డి ఈ విందులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలుగుదేశం పార్టీకి చెందిన వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, కావలి శాసనసభ్యులు ఈ విందుకు గైర్హాజరయ్యారు.

## చాన్నాళ్లకు వచ్చిన వర్షం

వర్షం కోసం తపిస్తున్న జన ఘోషను వరుణుడు ఆలకించినట్లున్నాడు. ఆగష్టు 30, 31 సెప్టెంబర్ 1, 2 తేదీల్లో జిల్లా అంతటా ఓ మోస్తరుగా వర్షం కురిసింది. మెట్ట ప్రాంతాల్లో గట్టిగా వర్షించిన మేఘాలు తీరప్రాంతంలో మాత్రం చిన్నపాటి జల్లులతో సరిపెట్టాయి. ఏదిఏమైనా ఈ వర్షానికి జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు. దుక్కి దున్నుకొనేందుకు ఈ వర్షం ఉపయోగపడుతుంది. ఈ వర్షం జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసింది.


అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ సినీకాంప్లెక్స్ రోడ్, నెల్లూరు. సెల్: 9248435616, 9849495615

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611


## పార్టీ మారిన వంటేరు జయచంద్రారెడ్డి

జలదంకి మండలంలో తెలుగుదేశం పార్టీకి పెట్టని కోట గోడలా వుండిన వంటేరు జయచంద్రారెడ్డి పార్టీ మారడం కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ రాజకీయాలను సంక్షుభితం చేసింది. జయచంద్రారెడ్డి గతంలో జలదంకి మండలాధ్యక్షునిగా, ప్రస్తుతం జడ్పీటీసిగా వ్యవహరిస్తున్నారు. కావలి మాజీ శాసనసభ్యుడు వంటేరు వేణుగోపాలరెడ్డి సోదరుడే జయచంద్రారెడ్డి.

## పార్లమెంటరీ కమిటీలకు ప్రాతినిధ్యం!

జిల్లాకు చెందిన ఇద్దరు పార్లమెంట్ సభ్యులకు పార్లమెంటరీ కమిటీల ఛైర్మన్లుగా వ్యవహరించే అవకాశం దక్కింది. జిల్లాకే చెందిన మరో ఇద్దరు పార్లమెంట్ సభ్యులకు ఈ కమిటీల్లో సభ్యత్వం లభించింది. దేశంలోనే అత్యంత కీలకమైన హోంశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా రాజ్యసభ సభ్యుడు, బిజెపి సీనియర్ నేత వెంకయ్యనాయుడు నియమితులయ్యారు. ఈ కమిటీలో సభ్యులుగా రాజ్యసభ సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి





నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, విజయవాడ పార్లమెంట్ సభ్యుడు లగడపాటి రాజగోపాల్ ఎంపికయ్యారు. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ, అటమిక్ ఎనర్జీ, స్పేస్‌తో సముద్రగర్భం అభి వృద్ధి వ్యవహారాలు చూసే కమిటీ ఛైర్మన్‌గా రాజ్యసభ సభ్యుడు తిక్కవరపు సుబ్బ రామిరెడ్డి నియుక్తులయ్యారు. రెండు పార్లమెంటరీ కమిటీలకు నెల్లూరీయులు ఛైర్మన్లుగా నియమింపబడడం అరుదైన విషయంగానే చెప్పుకోవాలి.

## శవాలను బయటకు తీస్తున్నారు

నెల్లూరు పొదలకూరురోడ్డు లోతట్టు ప్రాంతంలోని చెరువు వద్ద ఖననం చేసిన శవాలను ఓ ముఠా రాత్రి వేళల్లో త్రవ్వి బయటకు తీస్తున్న విషయం సంచలనం కల్గిస్తుంది. సహజంగా డబ్బున్న ముత్తయిదువలు చనిపోతే వారి చెవులు, ముక్కుల్లోని బంగారు ఆభరణాలు తీయకుండా ఖననం చేస్తారు. బంగారు ధర బ్రహ్మాండంగా వుండడంతో ఓ ముఠా పూడ్చిన శవాలను గుర్తించి మరీ అదే రోజు రాత్రి బయటకుతీసి ఆభరణాలు నొక్కేసి మళ్లీ పూడ్చేస్తున్నారు. రెండవరోజు కర్మచేయను ఈ ప్రాంతానికి వెళ్లిన వారు పందులు ఈ పనికి పాల్పడ్డాయని బాధపడి వచ్చేసేవారు. ఈ వారంలో ఓ కుటుంబీకులు పహారాకాసి మరీ ఈ ముఠాను పట్టుకొని దేహశుద్ధి చేసి వదిలేశారు.

## విజిలెన్స్‌పై ఇంటలిజెన్స్ రిపోర్టు

కంచే చేను మేసిన చందాన అక్రమ వ్యాపారులను పట్టుకోవాల్సిన నెల్లూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ అక్రమార్కుల దగ్గర నుంచి నెల మామూళ్లు తీసుకొని ప్రోత్సహిస్తున్న విషయమై ఇంటలిజెన్స్ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక నివేదిక సమర్పించినట్లు తెలిసింది. నెల్లూరులో పాతుకపోయిన విజిలెన్స్ అధికారులు పాల్‌రాజ్, మీసాల శ్రీనివాసులునాయుడు, బాబు నెలకు 25 లక్షల రూపాయలు లంచంగా స్వీకరిస్తూ జాక్‌పాట్ లారీలు, గ్రానైట్ లారీలు, బియ్యం లారీలు బిల్లులేవీ లేకుండా చెన్నై పోతున్నా తెలిసీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. నెల్లూరుకు ఇతర జిల్లాల నుంచి రోజు పదుల సంఖ్యలో ఆయిల్ ట్యాంకర్లు వస్తున్నా పట్టించుకోవడం లేదు. ఈ వివరాలతో కూడిన నివేదికను ఇంటలిజెన్స్ శాఖ ప్రభుత్వానికి పంపింది. ప్రభువులు ఎటువంటి నిర్ణయం తీసుకొంటారో వేచి చూడాలి.

## వైఎస్ స్నేహశీలి



ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తిరుగులేని మహానేత. ఆయనతో నాకు 1983 నుంచి అనుబంధం వుంది. మొదట్లో సాధారణ పరిచయమే వున్నా తర్వాత కాలంలో విడదీయలేని స్నేహబంధం ఏర్పడింది. 1985లో పిసిసి అధ్యక్షునిగా వున్నప్పటి నుంచి మా ఇద్దరి మధ్య ఎంతో సాన్నిహిత్యం వుండేది. నేను 89లో నెల్లూరు శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత ఇది మరింత గాఢమైంది. రాజశేఖర్‌రెడ్డి స్నేహధర్మానికి, నమ్ముకొన్న వారికోసం ప్రాణం ఇచ్చే వ్యక్తి. ఎవరికీ వెరవని తత్వం. కడపకు పోయేటప్పుడు పలుమార్లు మా యింటికి వచ్చి ఆతిథ్యం తీసుకొని వెళ్లేవారు. ఎవరు ఏ పనిమీద ఆయన దగ్గరకు వెళ్లినా కాదు అనకుండా పనిచేసి పంపడం ఆయన దీక్షాదక్షతలకు నిదర్శనం. నాకు అనేకసార్లు సహాయ సహకారాలు అందించి వున్నారు. ఎంతో దూరదృష్టిగల గొప్ప నాయకుడు. అలాంటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హఠాత్తుగా మరణించడం వ్యక్తిగతంగా నాకు తీరనిలోటు. రాష్ట్ర ప్రజలకు ఎవరూ మాన్పలేని గాయం.

జె.కె.రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

## మంచి పనిచేసినా మందలింపులు

అక్రమ బియ్యం లారీలను పట్టుకొని ప్రభుత్వ ఖజానాకు రెండు కోట్ల రూపాయలు వచ్చేట్లు చేసిన నెల్లూరు నగర డిఎస్పీ రాధికను ప్రశంసించే బదులు వున్నతాధికారులు మందలించినట్లు తెలిసింది. ఆమెను బదలీ చేయాలని పావులు కదిపినా ప్రభుత్వానికి చెడ్డపేరొస్తుందని వెనక్కు తగ్గినట్లు సమాచారం. నెల్లూరు కేంద్రంగా జరిగే అక్రమ బియ్యం వ్యాపారం గూర్చి ఎస్పీ మల్లారెడ్డికి, నగర సిఐ వీరాంజనేయరెడ్డికి తెలుసు. కానీ వీరిద్దరూ ఈ వ్యవహారం తెలియనట్లుగా నటించడం వెనుక స్మగ్లర్ల శక్తిపరులు కావడం అన్న ప్రచారం పోలీసుశాఖలో వుంది. నెల్లూరు వచ్చిన ఐజి కిషోర్‌కుమార్ కూడా పెద్దల జోలికి వెళ్లే ముందు ఒకమారు ఆలోచించమని డిఎస్పీకి నవ్వుతూనే చెప్పినట్లు ఆ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. తనను అభినందించాల్సిన నోర్లు నిందించిన బాధ నుంచి తేరుకోను రాధికకు కొన్నాళ్లు పట్టేట్లుంది. అయినా అధికారుల తుక్కు ప్రశంసలకంటే జనం అభినందనలే మిన్న మేడమ్.

## నిర్మాతల మండలి అధ్యక్షునిగా శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి!

తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షునిగా నెల్లూరీయుడు, ప్రముఖ నిర్మాత, సహజకవి మల్లెమాల సుందరరామిరెడ్డి(ఎం.ఎస్.రెడ్డి) తనయుడు మల్లెమాల శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఫిలిమ్‌నగర్‌లోని నిర్మాతల మండలి కార్యాలయంలో ఆగష్టు 30వ తేదీ ఈ ఎన్నిక జరిగింది. ఇటీవల సూపర్ హిట్ అయిన అరుంధతి చిత్రానికి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి నిర్మాత. సినీ పరిశ్రమలోని నిర్మాతలు పోటీపడే పదవికి ఎన్నికైన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మా అభినందనలు.

## అధిక ధర పలికిన లడ్డు!

వినాయకచవితి పండుగను పురస్కరించు కొని జిల్లాలో పలుచోట్ల నిర్వహించిన లడ్డూల వేలంపాటలో గతంలో ఎప్పుడూ పలకని రేటుకు అమ్ముడుపోయాయి.

కొరవ 14వ పేజీలో

# మెట్టు మెట్టుగా పైకెదిగి...



సతీమణి విజయలక్ష్మి, కుమారుడు జగన్‌తో వైఎస్.



పాదయాత్రతో ప్రజలకు దగ్గరైన వైఎస్.



ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న వైఎస్.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీవితప్రస్థానం నిజంగా ఒక మహా ప్రస్థానం. ఆయన రాజకీయ ప్రయాణంలో దారి పొడవునా ఎడారులు, ఎండమావులు మాత్రమే ఎదురైనాయి. ఆయన స్థానంలో మరొకరు వుండి వుంటే ఏళ్ల తరబడి నిరాశా నిస్పృహలతో నిరాశపడి, తెరమరుగైపోయి వుండేవారు. కానీ మొక్కవోని పట్టుదల, యముడికి శివుడికి వెరవని ధీరత్వం, అనుకొన్నది సాధించేదాకా విశ్రమించని దీక్ష, అవాంతరాలను అధిగమించే దక్షత, అవకాశం కోసం ఎంతకాలమైనా ఎదురుచూసే ఓర్పు, అది చేజిక్కినప్పుడు తనకనువుగా మలచుకొనే నేర్పు రాజశేఖర్‌రెడ్డి స్వంతం.

మొదటి నుంచి రాజకీయాల మీద ఆసక్తి వుంది. గుల్బర్గా మెడికల్ కాలేజి విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పోటీ చేసి గెలిచాడు. తండ్రి కోరిక మీద పులివెందులలో 70 పడకలతో ఆస్పత్రి నిర్మించి, కొంతకాలం ఉచిత వైద్యం అందజేశాడు. కానీ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకుడిగా ఎంత మందికి సేవ చేయగలం, అదే రాజకీయాలకు వెళ్తే మొత్తం రాష్ట్రానికి సేవలందించవచ్చు కదా అనే భావనతో, ఆస్పత్రిని క్రిస్టియన్ మిషనరీలకు అప్పచెప్పి, 1978లో రెడ్డి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా ఎన్నికైనాడు. అప్పటి నుంచి పులివెందుల నియోజకవర్గం ఆయనకు కంచుకోటగా మారింది. అక్కడ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాడు. కడప నుంచి నాలుగుసార్లు ఎమ్పీగా నెగ్గాడు. తన జీవితంలో ఓటమి అన్నది ఎరుగని అరుదైన రికార్డు స్వంతం చేసుకొన్నాడు.

అయితే కాంగ్రెస్ అధిష్టానం ఆయన ప్రజాదరణ, పలుకుబడులను గుర్తించలేదు. ఒక్క అంజయ్య తప్ప ఏ ముఖ్యమంత్రీ ఆయన్ను పట్టించుకోలేదు. ఢిల్లీలో కూడా అదే పరిస్థితి. కేంద్రంలో మంత్రిత్వం కోసం ఆయన చేయని ప్రయత్నం లేదు. కానీ అటు రాజీవ్‌గాంధీ, ఇటు పివి నరసింహారావులిద్దరూ నిరాశపరచారు. 1989 నుంచి ఆయనకు ముఖ్యమంత్రి పదవి మీద ఎనలేని మక్కువ. కానీ ఎన్ని అవకాశాలు వచ్చినా అధిష్టానం పక్కనపెట్టింది. దానితో రాష్ట్రంలో ఎవరు ముఖ్యమంత్రి అయినా, వారి మీద అసమ్మతి ప్రకటించి, తన అక్కసు తీర్చుకొనేవాడు. నిత్య అసమ్మతివాదిగా నింద భరించాడు. చెన్నారెడ్డిని పదవి నుంచి దింపడానికి హైదరాబాద్ పాతబస్తీలో మత కలహాలు సృష్టించాడన్న అపనింద కూడా పడింది రాజశేఖర్‌రెడ్డి మీద. 1999 ఎన్నికలు ఆయన్ను నిరాశపరచాయి. 2004లో కూడా అదే పరాభవం ఎదురౌతుందేమోనన్న భయంతో, అటు కాంగ్రెస్ పార్టీ గెలుపు, ఇటు కాంగ్రెస్‌లో తన నాయకత్వానికి బలుపు కోసం ఎర్రటి ఎండలో 1400 కిలోమీటర్ల పాదయాత్ర చేశాడు. వడదెబ్బ తగిలినా, కాళ్లు వాచి పుండ్లుగా మారినా, జ్వరంతో లేవలేని పరిస్థితి వచ్చినా లెక్కచేయలేదు. ఆయనెంత మొండి మనిషో, ఆయనలోని పట్టుదల ఎంత పటిష్టమైనదో ఆ పాదయాత్ర నిరూపిస్తుంది.

దాదాపు 15ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కానీ ఆయనకు ముఖ్యమంత్రిత్వ యోగం లభించలేదు. 2004 మే 10తేది ప్రమాణ స్వీకారం ఆయన జీవితంలో ఒక గొప్ప మలుపు. ఒక్కసారి అవకాశం వచ్చిన తర్వాత ఇక వెనుదిరిగి చూడలేదు. ముఖ్యమంత్రిత్వాన్ని ఆయనంత గొప్పగా సద్వినియోగం చేసుకొన్నవాడు లేడు. ఆ ఎన్నికల నాటికి ఆర్థికంగా చితికిపోయి వుండింది వారి కుటుంబం. హైదరాబాద్‌లోని ఇల్లు కూడా అమ్ముకోవాల్సిన పరిస్థితి. కానీ ఐదేళ్లలో దేశంలోనే అత్యంత ధనవంతుడైన రాజకీయవాదిగా ఎదిగాడు. వేల కోట్ల ఆర్జన ఆయన ఒడిలో వచ్చి వాలింది. అవినీతిపరుడని ఎందరు ఎన్ని విమర్శలు చేసినా పట్టించుకోలేదు. మరొకప్రక్క రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో వర్గాలను, నాయకులను అణిచి పారేశాడు. అధిష్టానాన్ని తనకు పాదాక్రాంతం చేసుకొన్నాడు. వైఎస్ లేకుంటే కేంద్రంలో ప్రభుత్వం నడవదన్న పరిస్థితి తెచ్చాడు. రాష్ట్ర కాంగ్రెస్ చరిత్రలో ఇంతటి బలీయమైన నాయకుడు ఇదివరకెన్నడూ లేడు. ఇప్పట్లో పుట్టబోడు.



మనవడి అన్నప్రాసనలో వైఎస్.



యువకుడిగా వ్యాయామం చేస్తూ.



పాదయాత్రలో ప్రజల మధ్య దైనందిక దినచర్యలో వైఎస్.



బుచ్చి - జొన్నవాద రహదారిలో కృష్ణారెడ్డి కట్టించిన ఆర్చ్. ఇన్‌సెట్‌లో కృష్ణారెడ్డి దంపతులు.

# పరోపకారి ఇప్పగుంట కృష్ణారెడ్డి!

- పదవీ విరమణ చేసిన ఈ చిరుద్యోగి సేవలు ప్రశంసనీయం

ఇతరులకు సహాయం చేయాలన్న సేవా గుణం వుండాలేగాని దానికి ఆర్థిక స్థితిగతులతో సంబంధమే లేదని నిరూపిస్తున్నాడు బుచ్చి పట్టణానికి చెందిన ఇప్పగుంట కృష్ణారెడ్డి. 30 సంవత్సరాలు బుచ్చి ప్రభుత్వ పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసినా సేవా కార్యక్రమాలను మాత్రం వీడలేదు. పాఠశాలలో వేదిక నిర్మించి ఇచ్చిన కృష్ణారెడ్డి తన పిఎఫ్ సొమ్ము నుంచి జన్మభూమి పథకానికి ఆకర్షితులై గాంధీనగర్‌లో సిమెంటురోడ్డును సొంత ఖర్చుతో నిర్మించారు. 2005లో లక్షరూపాయలు వెచ్చించి స్మశానవాటికలో కర్మక్రతువులు జరుపుకొనేందుకు షెల్టర్ నిర్మించారు. ప్రజాసేవాతోపాటు ధార్మిక కార్యక్రమాలు జరపడం కృష్ణారెడ్డి దాతృత్వానికి నిదర్శనం. జొన్నవాడలో 6 లక్షలతో ముఖ మండపం, వేణుగోపాలస్వామి విగ్రహం, బ్రహ్మంగారి మఠంలో వినాయక విగ్రహం, నెల్లూరులో నిప్పోఫ్యాక్టరీ వద్ద శ్రీదేవి భూదేవి విగ్రహాలు, కావలి-ఉదయగిరి రోడ్డులో గల శివాలయంలో నందీశ్వరుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించారు. పదిమందికి సహాయపడటంలోనే తృప్తి పొందుతున్నట్లు కృష్ణారెడ్డి చెబుతున్నాడు. పుట్టిన వూరికి, ప్రజలకు సహాయపడడంలోనే ఆనందం వుందంటున్న కృష్ణారెడ్డి ఆదర్శప్రాయుడు.

# సంగం పోస్ట్‌మెన్ తీరేవేరు

పోస్టల్ సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు ప్రజలను ఇబ్బంది పాలు చేస్తున్నది. విధులు సక్రమంగా నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పలు గ్రామాల్లో ప్రజలు బాధలు పడుతున్నారు. సంగంలోని పోస్ట్‌మెన్ తీరు అక్కడి వారిని చికాకుపెడుతుంది. ఇక్కడ పోస్టుమెన్‌గా పని చేస్తుండిన ఖాజా చనిపోతే ఆయన భార్యకు ఉద్యోగం ఇచ్చారు. ఆమెకు బదులు కుమారుడైన జాకీర్ ఆ బాధ్యతలు చూస్తున్నాడు. జాకీర్ వచ్చిన నాటి నుంచే సంగం వాసులకు కష్టాలు మొదలయ్యాయి. ఉత్తరాలు బట్వాడా చేయకుండా తిరుగుతుండడంతో సమాచారం అందక, ఉత్తరాలు, కార్డులు, బాండ్లు అందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ కార్డులు ఇవ్వకపోవడంతో వారి గోడు వర్ణనాతీతం. అతని బాధ తట్టుకోలేక పోస్టల్‌శాఖ తీరును నిరసిస్తూ గ్రామస్తులు ధర్నా చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో జాకీర్ మరింత నిర్లక్ష్యంగా తిరుగుతున్నాడు. పోస్టుమాస్టర్ డెప్యూటేషన్‌పై వెళ్లడం, గతంలో వున్న ఆమె విఆర్‌ఎస్ తీసుకోవడంతో పోస్టల్‌శాఖ దిక్కుమొక్కు లేకుండా పోయింది. ప్రజలు నిలదీస్తే అతను పెన్నానదిలోకి దూకే ప్రయత్నం చేయడంతో గ్రామస్తులు ఏమిచేయాలో పాలుపోక జుట్టు పీక్కుంటున్నారు.

# వెంకటగిరిలో షాపింగ్ కాంప్లెక్స్‌లెప్పుడు?

## ◆ హామీలకే పరిమితం

వెంకటగిరిలో షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మించాలన్న నిర్ణయం హామీలకే పరిమితం కావడంతో వున్న వనరులను సద్వినియోగం చేసుకొని రాబడి పెంచుకోగలిగి వున్నా పురపాలక సంఘం ఆ దిశగా దృష్టి సారించడం లేదు. మునిసిపాలిటీగా మారగానే పట్టణంలోని రోడ్డు ప్రక్కన గల స్థలాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని అప్పుడు మంత్రిగా వున్న రాజ్యలక్ష్మమ్మ భావించారు. ఈ మేరకు సైపల్యాపంతెన వద్ద, పాతబస్టాండు సమీపంలో, క్రాస్‌రోడ్డు, పాలకేంద్రం తదితర ప్రాంతాల్లో అనువైన స్థలాలను పరిశీలించారు. ఆ వైపుగా పురపాలక సంఘం దృష్టి సారించకపోవడం పట్ల పట్టణవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలో ప్రస్తుతం వున్న దుకాణాల సముదాయం నిరుపయోగంగా వుంది. ఇవి గత పంచాయతీ కాలంలోనే నిర్మించినవి అయినప్పటికీ వాటిని ఉపయోగంలోకి తెచ్చేందుకు సైతం మునిసిపాలిటీ ప్రయత్నించకపోవడం పాలకుల నిర్లక్ష్యాన్ని, అధికారుల వైఫల్యాన్ని తెలియజేస్తున్నది. కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించక, పాత వాటిని ఉపయోగంలోకి తేకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నెల్లూరు పురవీధులగుండా సాగిపోతున్న డాక్టర్ సుబ్రహ్మణ్యం పార్థీవ శరీరం.



సుబ్రహ్మణ్యం పార్థీవ శరీరానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ కనకారావు.



సుబ్రహ్మణ్యంకు సీనియర్ ఐఏఎస్ అధికారి కొప్పోలు రాజు శ్రద్ధాంజలి.



సిఎం ముఖ్య కార్యదర్శి సుబ్రహ్మణ్యం సతీమణిని ఓదారుస్తున్న బంధువులు.

# బాగా వెనుకబడ్డ 45వ డివిజన్!

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో వలు సమస్యలు తిష్టవేసి వున్నాయి. త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, డ్రైనేజి కాల్వల నిర్మాణం, సిమెంటు రోడ్ల నిర్మాణం తదితర సమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్‌గాని, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు గాని ఎవరూ ఈ డివిజన్ అభివృద్ధిపై దృష్టి సారించడం లేదు. మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఏదో ఒక సమస్యలు, విభేదాలు ఏర్పడుతున్నాయి. అధికారపక్షం, ప్రతిపక్షం సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరటం లేదు.

పాలకవర్గంలో ఏర్పడిన అభిప్రాయ భేదాలు అధికారులు బాగా ఉపయోగించుకొంటున్నారు. ఈ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన దువ్వూరు శరత్‌చంద్ర ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తరపున కార్పొరేటర్‌గా ఎన్నికైనా కాంగ్రెస్ పార్టీ నేతలతో కొద్ది రోజులు చెట్టపట్టాలు వేసుక తిరిగాడు. మళ్లీ తెలుగుదేశం పార్టీ నేతలతో జతకట్టాడు. రియల్‌ఎస్టేట్ వ్యాపారంలో నిత్యం బిజీగా వుంటున్న ఈ డివిజన్ కార్పొరేటర్ స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఏ మాత్రం స్పందించరన్న ఆరోపణలున్నాయి.

45వ డివిజన్ పరిధిలో కోటమిట్ట కొంతభాగం, కుక్కలగుంట, మహాలక్ష్మమ్మ గుడి తదితర ప్రాంతాలు వున్నాయి. కోటమిట్ట పడమటి వైపు రోడ్లు చాలా అధ్వాన్నంగా వున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నా అధ్వాన్నంగా వున్న రోడ్లు సిమెంటు రోడ్లుగా నోచుకోవడం లేదు. డ్రైనేజి కాల్వల నిర్మాణం సక్రమంగా లేక మురికినీరంతా రోడ్లపైన ప్రవహిస్తుంటుంది. మునిసిపాల్టీ నుంచి కార్పొరేషన్‌గా ఏర్పడి దాదాపు నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా అభివృద్ధి విషయంలో మాత్రం ఎటువంటి మార్పు కనిపించడం లేదన్నది నగరవాసుల అభిప్రాయం. ప్రజల నుంచి కోట్ల రూపాయలను పన్నుల రూపంలో వసూలు చేసుకొంటున్న కార్పొరేషన్ అధికార్లు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం చెందారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అనేకదఫాలు విన్నవించుకొన్నా ఎవరు పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ క్రమంలో డివిజన్‌లో జరిగిన అభివృద్ధి, స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు అభిప్రాయాలను ప్రకనిస్తున్నాం.



### సిమెంటు రోడ్లు వేయాలి!

అధ్వాన్నంగా వున్నరోడ్లను సిమెంటు రోడ్లుగా వేసేందుకు స్థానిక కార్పొరేటర్, కార్పొరేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. రాత్రుళ్లు వీధిలైట్లు సక్రమంగా వెలగడం లేదు. నాసిరకం లైట్లను వేస్తుండడం వల్ల అవి కాలిపోతున్నాయి.

-సిహెచ్.దయాకర్



### డ్రైన్లు నిర్మించాలి!

డ్రైనేజి కాల్వలు లేక పోవడం వలన చాలా ఇబ్బంది పడుతున్నాము. వున్న డ్రైనేజి కాల్వలు శిథిలావస్థకు చేరుకొని మురికి నీరంతా వీధులలో చేరి నిల్వ వుండడంతో, వీటిలో పందులు చేరి దుర్వాసన రావడంతోపాటు అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం వుంది.

-జయమ్మ



చెత్తా చెదారంతో పూడిన డ్రైనేజి కాలువ.



వీధుల్లో పేరుకపోయిన చెత్త.

అవినీతి కథ

# సందానిభాయ్ సామాన్యుడు కాడు

> నెల్లూరు జెండావీధి, కోటమిట్ట, మన్సూర్‌నగర్‌లలోని 7 మునిసిపల్ పార్కుల స్థలాలను దురాక్రమించి అమ్ముకొన్నా అడిగేనాథుడు లేడు



ఖుద్దూస్‌నగర్‌లో పార్కుకు కేటాయించిన స్థలంలో అక్రమనిర్మాణం జరుగుతున్న దృశ్యం.

నెల్లూరు కార్పొరేషన్‌లో ఆయనో సీనియర్ కార్పొరేటర్. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీ నేతలతో సన్నిహిత సంబంధాలు కలిగి వుండడం ఆయన నైజం. నగరంలో మునిసిపల్ కార్పొరేషన్‌కు చెందిన ఖాళీ స్థలాలు ఎక్కడ కనిపించినా వాటిని ఆక్రమించి పట్టాలు పుట్టించి విక్రయాలు చేయడం ఆయన వృత్తి. అధికారపార్టీకి చెందిన నేతలు, ప్రజా ప్రతినిధుల అండదండలు వుండడంతో అధికారులు సైతం ఎదురు చెప్పలేకపోతున్నారు.

44వ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న సయ్యద్ సందాని బాష కోట్ల రూపాయలు విలువ చేసే మునిసిపల్ కార్పొరేషన్ స్థలాలను ఆక్రమించాడు. ముస్లిం, మైనార్టీ వర్గాలకు పెద్ద మనిషిగా వ్యవహరించే ఈ కార్పొరేటర్ గతంలో కొత్తూరు సమీపంలో భూఆక్రమణలు చేయడం, అనంతరం అప్పటి నగర ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డితో విభేదించడంతో ఎమ్మెల్యే తన అధికారాన్ని వుపయోగించి అక్రమ కట్టడాలను కూల్చివేయించడం జరిగింది. ఆర్థికంగా నష్టపోయిన సందాని బాష తిరిగి ఆనం గూటికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

44, 45 డివిజన్ పరిధిలో వున్న మునిసిపల్ రిజర్వు స్థలాలకు సందాని బాష బినామి పేర్లతో పట్టాలు కూడా తెచ్చుకొన్నాడు. తన డివిజన్‌లోని మన్సూర్‌నగర్ సమీపంలో 250 అంకణాల మునిసిపల్ స్థలాన్ని ఆక్రమించి కొంత స్థలంలో మసీదు నిర్మాణం చేపట్టి వెనుక వైపు స్థలానికి తన సమీప బంధువులకు నివేశన స్థలం పేరుతో పట్టాలు తెచ్చి తన వద్ద వుంచుకొన్నట్లు చెబుతున్నారు స్థానికులు. నెల్లూరు జెండావీధి, కోటమిట్ట, మన్సూర్‌నగర్‌లలోని ఏడు మునిసిపల్ పార్కుల స్థలాలను దురాక్రమించి అమ్ముకొన్నా అడిగేనాథుడు లేడు.

మునిసిపల్ కార్పొరేషన్ స్థలాలతోపాటు ఇరిగేషన్‌శాఖకు చెందిన స్థలాలను ప్లాట్లు చేసి విక్రయించేశాడు. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో భూఆక్రమణలు చేయరాదని, పొసెషన్ సర్టిఫికేట్లు మంజూరు చేయరాదని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు వున్నాయి. అయినా వీటిని ఖాతరు చేయకుండా రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకొంటూ బినామి పేర్లతో పట్టాలు జారీ చేస్తున్నారు. గట్టిగా ఎవరైనా ప్రశ్నిస్తే అవసరమైతే ఎప్పుడైనా రద్దు చేసే అధికారం వుందని అస్పష్టమైన సమాధానం చెబుతున్నారు. సామాన్య మానవుడు జీవించేందుకు జానెడు ప్రభుత్వ స్థలంలో పూరిపాక వేసుకొంటే ఆగమేఘాల మీద వెళ్లి పీకేస్తారు ఈ అధికారులు.

అధికారం, రాజకీయ పలుకుబడి కలిగిన వారు కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే విచారించకుండా పట్టాలు మంజూరు చేసి తమ ఘనతను చాటుకొంటారు. కార్పొరేటర్‌గా వున్న సందాని బాష చేసిన భూఆక్రమణ గురించి ఒక్క ప్రజాప్రతినిధి కూడా ఇప్పటివరకు ప్రశ్నించకపోవడంపై నగర ప్రజలు విమర్శిస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ అధికారుల విధి నిర్వహణ గురించి ఇక చెప్పనవసరం లేదు. నగరంలో ఎన్ని రిజర్వుడు స్థలాలు వున్నాయో అధికారులకే తెలియదు. ఇటువంటి పరిస్థితులలో ఆక్రమణలకు గురైన స్థలాల గురించి పట్టించుకొనే వీలుండదు. ఈ వ్యవహారం సందానీబాషకు బాగా అనుకూలిస్తుంది. దీని వల్ల ఈ దురాక్రమణల పర్వాన్ని ఆయన కొనసాగిస్తూనే వున్నారు.

ఇంతేకాకుండా ఆక్రమణదారులకు పరోక్షంగా సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి కోట్ల రూపాయలకు పడగలెత్తిన కార్పొరేటర్ సందాని బాష వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపే ధైర్యం అధికార వర్గాలలో లోపించింది. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి సందాని బాష ఆక్రమించిన స్థలాలపై విచారణ జరిపించాల్సి వుంది.

## మనస్సాక్షి ముఖ్యం



మనస్సు మానవుడ్ని నియంత్రిస్తుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. మనస్సాక్షికి భయపడేవారు జీవితంలో చాలా గొప్పస్థాయికి ఎదుగుతారంటుంది హీరోయిన్ ఇలియానా. షూటింగ్‌లో వున్నా ఇంట్లో వున్నా తెల్లవారు జామున యోగా చేయడం ఇలియానాకు అలవాటు. ఈ విషయమై మాట్లాడుతూ యోగాతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. గతంలో గొప్పవాళ్లను చూస్తే వీళ్లను చేరుకోవడం మనతరమా అనిపించేది. ఇప్పుడు.... నా ఆలోచన తీరులో మార్పు కనిపిస్తోంది. వాళ్లు కూడా మనలాగా ఇటునుంచి వెళ్లినవారే కదా. దృఢ సంకల్పం తోడుంటే రోజుకో మెట్టూ ఎదగడం కష్టం కాదనిపిస్తుంది. ఎటువంటి బలాన్నైన్ని స్వీకరించడం, బలహీనతలను క్షమించే అలవాటు కలగడానికి యోగానే కారణమంటుంది ఇలియానా.

## గాలి మళ్లిన 'నయన'



మళయాళ ముద్దుగుమ్మ నయనతార మాతృభాషలో నటించిన చిత్రాలు తక్కువ. తమిళ, తెలుగు భాషాచిత్రాలవైపే ఆమె దృష్టి సారించింది. మళయాళం నుంచి అవకాశాలొచ్చినా ఆమె పట్టించుకోలేదు. కానీ ఈ మధ్య ఎందుకో నయన చూపులు కేరళవైపు మళ్లాయి. హీరో దిలీప్ సరసన బాడీగార్డ్ చిత్రంలో నటిస్తుంది. అలాగే ఓ సమాంతర చిత్రంలోనూ నటించాలని నయన నిర్ణయించుకొంది. అవార్డు సినిమాలు తీసే శ్యామ్ ప్రసాద్ దర్శకత్వంలో నటించేందుకు ఆమె అంగీకారం తెలిపింది.మామూలుగా మళయాళ హీరోయిన్లకు 10 లక్షలకు మించి పారితోషికం ఇవ్వరు. ఇక సమాంతర సినిమా అంటే మరీ తక్కువ. దీంతో శ్యామ్‌ప్రసాద్‌కు తనకు పారితోషికం వద్దని చెప్పిందట. ఆమె మెర్క్యురీ అనే మరో మళయాళ చిత్రంలోనూ నటించను ఓకే చెప్పింది. అవార్డు ఆశించే ఆమె పారితోషికాలు వద్దంటుందని మళయాళ సినీవర్గాలు చెవులు కొరుక్కొంటున్నాయి.

## ఇక చదువుకుంటాను

జయం చిత్రంతో తెలుగు చిత్రపరిశ్రమకు పరిచయమైన అందాల నటి సదా. అపరిచితుడు చిత్రం సదా సినీ జీవితాన్ని మార్చేస్తుందని కలలుగన్నారు సినీ అభిమానులు. కానీ అలా జరగలేదు. దీనితర్వాత తమిళ, కన్నడ, హిందీ భాషల చిత్రాల్లో నటించినా సదాను విజయాలే పలకరించడంలేదు. దీంతో ఆమె చదువుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ విషయమై మాట్లాడుతూ నేను చిన్నప్పటి నుంచి బాగా చదువుకొనేదాన్ని. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నప్పుడు నాకు సినిమాల్లో నటించడానికి అవకాశాలొచ్చాయి. చదువు సగంలో ఆపినందుకు బాధపడలేదు. అంతగా చదవాలనుకుంటే దూర విద్య వుండనే వుంది కదా అని అనుకునే దాన్ని. ఇన్నాళ్లూ షూటింగ్ బిజీలో వున్నాను. ఇక మీదటైనా చదువు మీద దృష్టి పెడతానంది.



## శిల్పను చూసి చలించిన స్వామి

పొడుగు కాళ్ల సుందరి శిల్పాశెట్టి నిరంతరం వివాదాల్లో మునిగి తేలుతుంటుంది. బిగ్ బ్రదర్, రిచర్డ్ గెరెతో ముద్దుల గొడవ పాత వ్యవహారాలే. ఈ మధ్య ఒరిస్సాలోని ఓ దేవాలయంలో ఈమె ప్రవేశించిన తీరు వివాదం రేపింది. అది సమసిపోక ముందే శిల్ప ముంబాయి శివార్లలోని పొవైలో వున్న ఆలయానికి వెళ్లిందట. అక్కడ స్వామీజీ ఒకరు శిల్పను ముద్దుపెట్టుకొన్నారని వివాదం మొదలయ్యింది. స్వామి శిల్ప బుగ్గలు పట్టుకొని తనమెడలోని జపమాలను... ఆమె నుదుటిపై ఉంచి ఆశీర్వదించారట. శలారి పెడుతున్నప్పుడు సైతం స్వామి ముఖంలో ఆధ్యాత్మిక భావనలు కనపడలేదని పత్రికల్లో పుంఖాను పుంఖాలుగా వార్తలొచ్చాయి. ఈ విషయాన్ని ఇటు శిల్పగానీ, అటు ఆలయ వర్గాలుకానీ ఖండించలేదు.



## ఛాన్స్ కొట్టిన చైతన్య!



తొలి చిత్రం విడుదల కాకమునుపే అక్కినేని నాగచైతన్య రెండో చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని సూపర్‌స్టార్ కృష్ణ కుమార్తె ఇందిర నిర్మాతగా వ్యవహరించి తీస్తున్నారు. ఈ చిత్రానికి విలక్షణ దర్శకునిగా పేరుగాంచిన గౌతమ్‌మీనన్ దర్శకత్వం వహిస్తారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎఆర్‌రెహమాన్ స్వరకర్తగా పనిచేయను ఒప్పుకొన్నారు. ఈ విషయమై చైతన్య మాట్లాడుతూ 'జోష్' విడుదల కాకుండానే రెండో చిత్రం మొదలుకావడం ఆనందంగా వుంది. గౌతమ్‌మీనన్ చిత్రంలో నటించాలని ఎన్నాళ్లగానో అనుకొంటున్నాను. ఇంతత్వరగా అవకాశమొస్తుందని ఊహించలేదన్నాడు.



## జాకీచాన్‌తో ఆసిన్

హిందీ గజిని చిత్రం బంపర్ హిట్ కావడంతో అందులో హీరోయిన్ ఆసిన్ అదృష్టాన్ని చూసి చాలా మంది తారలు అసూయపడ్డారు. దీంతో దిష్టి తగిలిందేమో ఆసిన్‌కు బాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయి. అయితే ఈ కేరళ కుట్టికి జాకీచాన్‌తో కలసి నటించే బంపర్ ఆఫర్ ఒకటి తగిలింది. ఇటీవలే ఒక యాడ్ ఫిల్మ్‌లో ఆయనతో కలసి నటించి వచ్చింది. అది త్వరలోనే మనదేశంలోనూ ప్రసారం కానుంది. ఇదిలా వుండగా ఆసిన్ ఇటీవలే ముంబైలో కొత్త ఫ్లాట్ కొనుక్కుని అందులో చేరింది. విచిత్రమేమంటే చెన్నైలో ఆమె వుండిన ఫ్లాట్‌ను అమ్మకానికి పెట్టింది.

## తెలుగింటి అల్లుడు



అరుంధతి చిత్రంలో మాంత్రికుడంటే చాలు సోనూసూద్ అని అందరూ ఠక్కున పేరు చెప్పేస్తారు. ఇటీవలే ఆంజనేయులు చిత్రం విలన్‌గా నటించిన ఆయన పూరిజగన్నాథ్ తీస్తున్న ఏక్ నిరంజన్ సెట్‌లో పిచ్చాపాటీగా మాట్లాడారు. నేనెక్కడ కనపడ్డా అందరూ అరుంధతి చిత్రాన్నే ప్రస్తావిస్తున్నారు. ఇటీవల అమితాబ్ సార్ కూడా మాంత్రికుని పాత్రను మెచ్చుకున్నారు. మీకో విషయం తెలుసా? నా భార్య తెలుగమ్మాయి. కాకపోతే వారి కుటుంబం ముంబాయిలో స్థిరపడింది. నా భార్య తరపున వాళ్లంతా బాగా నటించానని నన్ను మెచ్చుకొంటున్నారు. భవిష్యత్తులో నిర్మాతగా మారే అవకాశాలున్నాయి. మంచి కథ దొరికితే సినిమా తీస్తానంటున్నాడు సోనూసూద్.



గోవా సుందరి జెనీలియా తెలుగు, తమిళ భాషలతోపాటు హిందీ చిత్రాలలోనూ బిజీగా వుంది. ఇటీవల బాలీవుడ్‌లో పెద్ద వాణిజ్య కంపెనీలు రాణీముఖర్జీ, ప్రీతిజింతా స్థానంలో జెనీలియాతో ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి. ఆ విషయమై ఆమె మాట్లాడుతూ ఒప్పం

## నేనెవరితో తిరగడం లేదు!

దం కుదుర్చుకొన్నంత మాత్రాన వారి స్థానాన్ని నేను భర్తీ చేసినట్లు అనుకోను. వాళ్లు నటన అనే రంగంలో కొన్నివేల మైళ్లు దాటేశారు. నేనిప్పుడే బుడి బుడిగా నడుస్తున్నానంది. రితేష్ దేశ్‌ముఖ్‌తో నేను ప్రేమాయణం సాగిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. మేమిద్దరం కలసి రెండు సినిమాలు చేశాం. ఆ చిత్రాల నిర్మాణానికి కాస్త ఎక్కువ రోజులే పట్టాయి. అందుకే అలా అనుకొంటున్నట్లున్నారు. ఓ నిజం చెప్పనా? ఇలాంటి వేవో వస్తాయనే నేనింత వరకు అతనితో కనీసం కాఫీ తాగడానికి కూడా బయటకు వెళ్లలేదంది.

# శవం ప్రక్కన వారసత్వ ప్రయత్నం

కోట్లాది జనహృదయ నేతగా నీరాజనాలందుకొన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మృతదేహానికింకా అంత్యక్రియలు జరగలేదు. టివి ఛానళ్లలో అత్యంత దురదృష్టకరమైన, భయానకమైన ఆయన చావు దృశ్యాల ప్రసారం ఆగలేదు. వాటిని చూస్తున్న జనం కళ్లలో నీటితడి ఆరలేదు. అభిమానుల ఇళ్లలోని పొయ్యిలో పిల్లి లేవలేదు. రాష్ట్ర ప్రజలు ఆ దిగ్భ్రాంతి నుంచి కోలుకోలేదు. కానీ ఆయన కుమారుడు వై.ఎస్.జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్పీలు నిస్సిగ్గుగా, నిర్లజ్జగా వీధులలోకి వస్తున్నారు. వాదులాడుకుంటున్నారు.

రాజకీయం మహా చెడ్డ వ్యసనం. పదవీకాంక్ష మరింత హేయమైన బలహీనత. నరమాంసం మరిగిన పులి, అధికారం మీద మక్కువ కలిగిన రాజకీయవాది ఒకటిగానే ప్రవర్తిస్తారని పెద్దలు ఊరకే చెప్పలేదు. రాజశేఖర్‌రెడ్డి ఎంత ఉత్కృష్టమైన రాజకీయ ప్రాభవాన్ని అనుభవించాడో, అంత దయనీయమైన మరణం చవిచూశాడు. శరీరం చిన్నాభిన్నమై, కాలొక పక్క చెయ్యొక పక్క విసిరివేయబడి, మాంసం ముద్దగా మారి, 24 గంటల పాటు ఆలనా పాలనా లేక, అడవి జంతువుల పాలపడి, పగవాడికి కూడా ఈ చావు వద్దురా భగవంతుడా అని ప్రార్థించేంత దయనీయమైన స్థితిలో మరణించారాయన. ఆ హృదయ విదారక దృశ్యాలు చూస్తుంటే వళ్లు గగుర్పొడుస్తున్నది. ఆయనతో ఏ సంబంధం లేని సాధారణమైన జనం కూడా ఆ విషాదం నుంచి తేరుకోలేక పోతున్నారు. అయ్యోపాపం అని కన్నీళ్లు పెడుతున్నారు. ఇంతటి విషాదస్థితిలో ఆయన కుమారుడు పదవి కోసం ప్రాకులాడుతున్నారన్న ప్రచారం జరగడం వినే వారికి వికారం కల్గిస్తున్నది.

నిజంగా జగన్ ముఖ్యమంత్రి పదవి కోరుకొంటున్నారో, లేదో తెలియదు, కానీ ఆయన పేరుతో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు మాత్రం పరమనీచంగా ప్రవర్తిస్తున్నారు. మానవత్వం లేని పశువుల వలె వ్యవహరిస్తున్నారు. వారిది బ్రతుకు తెరువు పోరాటం. రాజశేఖర్‌రెడ్డికి వీర విధేయులుగా మసిలిన తాము, వేరొకరు ముఖ్యమంత్రి అయితే ఇబ్బందులు పడవలసి వస్తుందన్న ఏకైక భయంతో జగన్ పేరు తెరమీదకు తెస్తున్నారు. తమ కపటం, తమ స్వార్థం, తమ కక్కుర్తిబుద్ధి, తమ నీచ ప్రవృత్తుల వల్ల వైఎస్ ప్రతిష్టకు జరుగుతున్న అపచారం, అపకారం లెక్కలోకి రావడం లేదు.

## ఆపద్ధర్మం అనే పదం లేదు



కొత్త ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. 3వ తేది మధ్యాహ్నం నిశ్శబ్దంగా ఈ కార్యక్రమాన్ని ముగించారు గవర్నర్ ఎన్.డి.తివారి. ముఖ్యమంత్రి కుర్చీ ఖాళీగా వుంచడానికి వీలు లేదు కాబట్టి, ఈ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ అధిష్టానం. అందువల్లనే ఆయన్ను ఆపద్ధర్మ ముఖ్యమంత్రి అని పిలుస్తున్నారు. అయితే రాజ్యాంగంలో ఆపద్ధర్మం అనే పదం లేదు. ముఖ్యమంత్రి ముఖ్యమంత్రే. పార్టీదృష్టిలో తాత్కాలిక ఏర్పాటు అయినా, రాజ్యాంగం ప్రకారం ఆయన పూర్తికాలం ముఖ్యమంత్రి క్రిందే లెక్క ప్రభుత్వానికి అన్ని విధాలా అధిపతి. సాధారణ పరిస్థితులలో అయితే, సంతాప దినాలు ముగిసిన తర్వాత కొత్త ముఖ్యమంత్రి ప్రకటన జరుగుతుంది. సిఎల్‌పి సమావేశం ఏర్పాటుచేసి, ఢిల్లీ నుంచి పంపే సీల్డ్ కవర్ తెరిచి, కొత్త నాయకుడిని ఎన్నుకొంటారు. అయితే జగన్ పేరు ప్రచారంలోకి వచ్చింది కాబట్టి, అది అధిష్టానానికి ఇష్టంలేని పరిస్థితులలో కనీసం రెండు నెలలపాటు రోశయ్యనే పూర్తికాలం ముఖ్యమంత్రిగా కొనసాగిస్తారని ఒక అంచనా. పదిపదిహేను మంది మంత్రులను తీసుకొనేందుకు కూడా అనుమతి ఇస్తారట. వైఎస్ మరణం వల్ల ఏర్పడిన ఉద్విగ్న పరిస్థితులు చల్లారినాకే కొత్త ముఖ్యమంత్రి నిర్ణయం జరగవచ్చు.

### ● ప్రాణం పోసుకొంటున్న కాంగ్రెస్ విష సంస్కృతి

నిజంగా వైఎస్ ఈ క్షణంలో బ్రతికి వుంటే ఇటువంటి వారినా తాను తన అభిమానులుగా భావించి, ఆదరించింది అని బాధపడి తీరుతాడు.

దాదాపు 120 మంది ఎమ్మెల్యేలు వైఎస్ జగన్ పేరు ప్రతిపాదిస్తూ అధిష్టానానికి విజ్ఞప్తి పత్రం తయారు చేశారు. అయితే కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ వీరప్ప మొయిలీ దాన్ని చేతితో తాకడానికి కూడా ఇష్టపడలేదు. చాలా దురుసుగా, దుందుడుకుగా వ్యవహరించారు ఈ ఎమ్మెల్యేలు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఆర్థికమంత్రి రోశయ్య ప్రమాణ స్వీకారాన్ని అడ్డగించాలని ప్రయత్నం చేశారు. అధిష్టానం తరపున అహ్మద్ పటేల్ కన్నెర చేయడంతో ఆగారుకానీ, లేకుంటే రాజ్‌భవన్ వద్ద చీకాకు సృష్టించి వుండేవారు.

టిఆర్ఎస్ నుంచి వలస వచ్చిన తూర్పు జయప్రకాష్‌రెడ్డి ఇంకా హీనంగా దిగజారి ప్రజారాజ్యం అధినేత చిరంజీవి వద్దకు ఇరవై మంది ఎమ్మెల్యేలతో రాయబారం నడిపారు. జగన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రికి చిరంజీవి మద్దతు ఎందుకో తెలియదు. ఒకవేళ కాంగ్రెస్‌లోని ఒక వర్గం జగన్ మీద



తిరుగుబాటు చేస్తే, ఎమ్మెల్యేల బలం కూడగట్టుకోవాలన్న దూరదృష్టి అన్నమాట. కానీ అది దురదృష్టపు దృష్టే తప్ప, దూరదృష్టి కాదు. సుతిమెత్తటి చెప్పుతో కొట్టి నట్లు, ముఖ్యమంత్రి పదవి చర్చకు ఇది సమయం కాదని చెప్పి పంపాడు చిరంజీవి.

ఏది ఏమైనా వైఎస్ నిష్క్రమణతో రాష్ట్ర రాజకీయాలలో పాత సాంప్రదాయాలకు ప్రాణం లేచి వచ్చింది. వర్గాలు, పదవీ

కొరవ 14వ పేజీలో




# సుబ్రహ్మణ్యం మరణంతో తల్లడిల్లిన గుడిపల్లిపాడు!

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యకార్యదర్శి పొంతగుంట సుబ్రహ్మణ్యం హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడంతో ఆయన స్వగ్రామం గుడిపల్లి పాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు, బంధువులు, మిత్రులందరూ కూడా ఆయన మరణవార్త విని తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన సుబ్రహ్మణ్యం ప్రాథమిక విద్యను చిన్న చెరుకూరు హైస్కూల్‌లో, ఇంటర్ వీఆర్ కళాశాల, డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ కావలి జవహర్ భారతి కళాశాలలో చదివారు. 1983 సంవత్సరంలో సివిల్ సర్వీస్ పరీక్షలు వ్రాసి ఐఏఎస్‌కు ఎంపికయ్యారు.

### సమర్ధవంతంగా బాధ్యతల నిర్వహణ!

27 సంవత్సరాల సర్వీసులో వివిధ జిల్లాల కలెక్టర్‌గా సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించారు. కుటుంబంలో చివరి సంతానం సుబ్రహ్మణ్యం. తల్లిదండ్రులు, ఓ అన్న, అక్క ఇటీవలే మరణించారు. పెద్ద అక్క వెంకటగిరిలో నివాసం వుంది. సుబ్రహ్మణ్యంకు భార్య, కూతురు, కొడుకు వున్నారు. గుడిపల్లిపాడు గ్రామంలోని అనేక మంది యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత ఆయనకు దక్కింది. గ్రామస్తుల కోరిక మేరకు రామాలయానికి మరమ్మత్తులు, నూతనంగా కళ్యాణ మండపం తన స్వంత నిధులతో నిర్మించారు.

గ్రామంలో అందరినీ పలుకరించి కష్ట సుఖాలు అడిగి తెలుసుకొనేవాడని గ్రామస్తులు గుర్తు చేసుకొని మరీ విలపిస్తున్నారు. తమ గ్రామం మంచి వ్యక్తిని కోల్పోయిందని దుఃఖిస్తున్నారు. సుబ్రహ్మణ్యంకు పిజిలో సహధ్యాయి ఆనం జయకుమార్‌రెడ్డి గుడిపల్లిపాడు వెళ్లి ఆయన ఇంట్లోని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీల నాయకులు, మిత్రులు గుడిపల్లిపాడు గ్రామానికి వెళ్లి సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులను పరామర్శించారు. సుబ్రహ్మణ్యం మృతిపై గ్రామస్తులు వెల్లడించిన అభిప్రా యాలను దిగువనిస్తున్నాం.



గుడిపల్లిపాడులోని రామాలయంలో సుబ్రహ్మణ్యం కట్టించిన కళ్యాణ మండపం. ఇన్‌సెట్లో ఆయన ఫోటో.



#### బాధాకరంగా వుంది

మంచి భవిష్యత్తు కలిగిన సుబ్రహ్మణ్యం హెలికాప్టర్ ప్రమాదంలో ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డితోపాటు దుర్మరణం చెందడం బాధాకరంగా వుంది. ఎప్పుడు గ్రామానికి వచ్చినా గ్రామస్తులతో పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చలు జరిపేవారు. మొదట నుంచి కూడా ఆయన ఇతరులకు సహాయం చేసే మనస్తత్వం కలిగిన వ్యక్తి. అటువంటి వ్యక్తిని కోల్పోవడం గ్రామానికి తీరని లోటు.

బుజ్జమ్మ



#### తట్టుకోలేక పోతున్నాం!

హెలికాప్టర్ ప్రమాదంలో మా గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి సుబ్రహ్మణ్యం మరణించాడన్న వార్తను గ్రామస్తులు తట్టుకోలేక పోతున్నారు. కుటుంబంలో ఆఖరివాడైన సుబ్రహ్మణ్యం ఎంతో కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరుకున్నాడు. అటువంటి వ్యక్తిని ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడం దురదృష్టకరం.

పుల్లయ్య



#### మంచి వ్యక్తిని కోల్పోయాం

మా గ్రామంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తి సుబ్రహ్మణ్యం. అటువంటి మంచి వ్యక్తి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. గ్రామానికి ఎటువంటి సహాయం కావాలన్నా తనవంతు సహాయం అందించడంలో ముందుండేవాడు. సుబ్రహ్మణ్యం మరణించడం వల్ల కుటుంబంలో మగదిక్కు లేకుండాపోయారు.

సుజన



#### ఆప్తుడిని కోల్పోయాం

మా గ్రామానికి చెందిన ఐఏఎస్ అధికారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సుబ్రహ్మణ్యం హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెందడంతో ఒక ఆప్తుడిని కోల్పోయినట్లు భావిస్తున్నాం. గ్రామానికి అన్నివిధాలుగా సహాయం చేసిన వ్యక్తి మరణించాడన్న వార్త అందరిని కలచి వేస్తుంది. ఎంతో కష్టపడి ఉన్నతస్థాయికి ఎదిగినవ్యక్తి మా ముందు లేకపోవడం బాధగా వుంది.

వేమయ్య




స్వర్గీయ కోడూరు వెంకటకృష్ణారెడ్డి గారు
మరణం: 28-08-2009

**ఉత్తరక్రియలు**

నిర్మలమైన మనస్సు, నిండైన చిరునవ్వుతో మా అందరి మనస్సులలో నిండిన
నీ ఆత్మీయత, అనురాగాలు ఎన్నటికి మరువలేనివి.
మంచికి మారుపేరుగా నిలచిన మా ఇంటి దైవం
**శ్రీ కోడూరు వెంకటకృష్ణారెడ్డి గారు**
తేది 28-08-2009 శుక్రవారం నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతిని కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

ఉత్తర క్రియలు : తేది 10-09-2009 గురువారం నాడు పెద్దకర్మ
వెంకటాచలం మండలం, పూడిపర్తిగ్రామంలోని మా స్వగృహామునందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

కుమారులు - కోడలు
కోడూరు రామచంద్రారెడ్డి - సుజన
కోడూరు రంగారెడ్డి - -

కుమార్తె - అల్లుడు
సునీతమ్మ - బత్తలకృష్ణారెడ్డి

భార్య : శకుంతలమ్మ
మరియు
మనుమలు - మనుమరాళ్లు

Regn.No. : RN 1156 / 57
J/Nellore/008/09-11

# దీపం ఆరిపోయింది

8&9వ పేజీల కొరవ

## అంతా అయోమయం

వైఎస్ఆర్ లేని రాష్ట్ర ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని వూహించుకోవడం కష్టంగా వుంది. ఆయన మరణం చాలామందిని, చాలా రూపాలలో అయోమయానికి గురి చేస్తున్నది. రేపు అన్నది ఎట్లా అనే ప్రశ్నార్థకాన్ని మిగిలిస్తున్నది. రాష్ట్ర కాంగ్రెస్‌లో వైఎస్ ఒక్కడే నాయకుడు. తతిమా వారంతా అనుచరులు, కార్యకర్తలు మాత్రమే. గత ఆరేళ్లలో కాంగ్రెస్ పార్టీ మీద ఆయన పెంచుకొన్న పట్టు, పలుకుబడి అటువంటివి. ఢిల్లీలో కానీ, హైదరాబాద్‌లో కానీ వైఎస్ మాటే వేదవాక్కు. ఏమి చేయాలన్నా నిర్ణయం ఆయనది; ఆచరణా ఆయనదే. ఇప్పుడు పార్టీలో ఆ స్థానాన్ని భర్తీ చేసేవారు ఎవరు? ఆ స్థాయి, ఆ పట్టు, ఆ నియంత్రణ, ఆ దూరదృష్టి ఎవరికి వుంది? ప్రభుత్వం విషయం కూడా అంతే. కొన్ని వందల పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులు, పనులు మొదలుపెట్టి వున్నాడు వైఎస్. లెక్క పెట్టలేనన్ని సంస్థలు స్థాపించాడు. వాటిలో చాలావరకు మొగ్గ దశలో వున్నాయి. ఇంకా పురిటినొప్పులు పడుతున్నాయి. ఇప్పుడు వాటి గతి ఏమిటి? కొత్తగా వచ్చేవారు వాటిని కొనసాగించగలరా? మధ్యలోవదిలేస్తారా? ఆ పాలనా దక్షత, అధికారుల మీద అదుపు కొత్తగా వచ్చేవారికి వుంటాయా?

పేద ప్రజల మానసిక ఆందోళన వర్ణించరానిది. ఆరోగ్యశ్రీ, 108, ఫించన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ గృహకల్ప, సబ్సిడీ బియ్యం, ఉచిత విద్యుత్ వంటి పథకాలెన్నిటినో మొండిగా నడిపిస్తున్నాడు వైఎస్. ఖజానాలో నిధులు ఖాళీ అయినా లెక్క చేయకుండా బ్రతికిస్తున్నాడు. వీటివల్ల కొన్ని కోట్ల మంది పేద ప్రజలు ప్రయోజనం పొందుతున్నారు. ఇప్పుడాయన వున్నట్లుండి అదృశ్యమై పోయాడు. కనపడని లోకాలకు తరలివెళ్లాడు. ఆయన లేకుండా ఈ పథకాలు నడుస్తాయా, ఆ ప్రయోజనాలను కోల్పోతే తమ జీవితాలు ఎంతగా దెబ్బతింటాయి అన్న ఆవేదన పేద ప్రజలలో ముప్పిరిగొంటున్నది. వారు తీవ్రమైన మానసిక ఆందోళనతో నలిగి పోతున్నారు. దుఃఖం ఆపుకోలేకపోతున్నారు. భోరున విలపిస్తున్నారు.

## నమ్మితే, ప్రాణం

నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం అని ఛలోక్తులు విసురుతుంటారు. కానీ ఆ మాటను ఆచరణలో చూపినవాడు రాజశేఖర్‌రెడ్డి. తనను నమ్మి, అభిమానించి, అనుసరించినవారందరికీ ఆయన తన ప్రాణం ఇవ్వడానికి కూడా వెనుకాడేవాడు కాదు. ఆయన్ను నమ్మి చెడ్డ వాడు లేడనడం నిజం. రాయలసీమ ఫ్యాక్షనిస్టులు ఎందరికో ఆయన దేముడితో సమానం. ప్రత్యర్థుల నుంచి వారి ప్రాణాలు కాపాడడానికి ఎన్నోసార్లు తన ప్రతిష్టను అడ్డం పెట్టాడు. అవినీతివూబిలో చిక్కుకపోయిన మంత్రుల పాపాన్ని తనే మోశాడు. జిల్లాల నుంచి వచ్చే చోటా రాజకీయవాదులను కూడా, తన వారైతే చాలు, అందలం ఎక్కించాడు. వారి తప్పులన్నీ క్షమించాడు. ఎసిబి కేసులలో చిక్కుకున్నా ప్రమోషన్లు ఇచ్చేవాడు. హత్యకేసులు మాఫీ చేయించాడు. జీవిత ఖైదీలను విడిపించాడు. వీటన్నిటివల్ల తన పేరు, పరువు భంగపడుతున్నాయన్నా లెక్కచేయలేదు. రాజకీయాలలో అనుచరులను ఇంతగా ఆదరించిన నాయకుడు మరొకరు లేరు. అందు వల్లనే ఆయన మరణం లక్షలాది మందిలో ఆప్తుడిని, ఆత్మీయుడిని కోల్పోయిన పరితాపం కల్గిస్తున్నది. ఏ కోణం నుంచి చూసినా రాజశేఖర్‌రెడ్డి వంటి నాయకుడు, రాజకీయవాది, మానవతా హృదయుడు, పేదల పక్షపాతి, రైతు జన బాంధవుడు, పరిపాలనాదక్షుడు రాష్ట్ర చరిత్రలో మరొకరు కన్పించరు. అవినీతికి ఆశ్రయం ఇవ్వడం తప్ప ఆయనలో మరొక లోపం లేదు. రాష్ట్ర భవిష్యత్తును ఉజ్జ్వలంగా తీర్చి దిద్దడానికి ఎన్నో పథకాలు, ప్రణాళికలు ఆయన మదిలో మెదలుతూ వుండినాయి. ఒక్కసారిగా అవన్నీ అదృశ్యమై పోయాయి. ఆయన నిష్క్రమణతో కోట్లాదిమంది ప్రజల ఇంటి దీపం ఆరిపోయింది.

AUDISANKARA
COLLEGE OF ENGINEERING & TECHNOLOGY
Gudur, Nellore Dist.
HATTRICK
in the I B.Tech JNTUA Results
Eamcet Counselling Code : SANK
2007 2008 2009
Courses offered : B.Tech : ECE,CSE, EEE, Civil. M.Tech : CSE, VLSI. MCA,MBA
Hearty Congratulations to Principal Dr. A.V.S. Prasad,
HOD of H&S Prof. M.Rajaiah, Teaching & Non-Teaching Staff
for having scripted this Spectacular Success Story
Admissions are in Progress
Contact : 99599 11692, 92470 33332
VANKI PENCHALAIAH
- Chairman

ద్వితీయవర్ధంతి



అనురాగానికి ప్రతిరూపంగా, ఆత్మీయతకు ఉపమానంగా
తన మనసులోని తియ్యదనాన్ని మా అందరికి పంచి,
మా హృదయాలలో ప్రేమపుష్పాలు పూయించిన అమృతమూర్తి
స్వర్గీయ బుర్లా నాగార్జునరెడ్డి గారు
పరమపదించి తేది 07-09-2009 నాటికి
రెండు సంవత్సరాలు నిండుతాయి.
మరువలేని ఆ మధుర స్మృతులను స్మరించుకొంటూ...
ద్వితీయవర్ధంతి సందర్భంగా అశ్రునయనాలతో
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

| | | |
|---|---|---|
| తల్లి | : | బుర్లా బుజ్జమ్మ |
| అన్న | : | బుర్లా గోపాల్‌రెడ్డి |
| అన్న | : | బుర్లా శివకుమార్‌రెడ్డి |
| తమ్ముడు | : | బుర్లా గిరిధర్‌రెడ్డి |

స్వర్గీయ బుర్లా నాగార్జునరెడ్డి గారు

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.